# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-07-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **కేంద్ర ప్రభుత్వం 9 ప్రాధాన్య అంశాల ఆధారంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.**

**2.** **దేశ ఆర్థికాభివృద్ధికి కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ దోహదం చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**

**3.** **బడ్జెట్‌లో కొత్త పన్ను విధానంలో కొన్ని మార్పులు చేసినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.**

**4.** **బడ్జెట్‌లో రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి 15 వేల కోట్ల రూపాయల ఆర్థిక సాయం ఇవ్వనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు.**

**5.** **శాసనసభ సమావేశాల్లో భాగంగా ఈ రోజు గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు.**

**6.** **రాష్ట్రంలో వచ్చే ఏడాది నుండి ప్రభుత్వం అత్యుత్తమ విద్యా విధానాన్ని ప్రవేశ పెడుతుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు.**

**==========================**

కేంద్ర ప్రభుత్వం 9 ప్రాధాన్య అంశాల ఆధారంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లు కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా ఈరోజు లోక్ సభలో 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను వరుసగా ఏడోసారి మంత్రి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆర్థిక వ్యవస్థలో అవకాశాలను సృష్టించడమే లక్ష్యంగా వ్యవసాయ రంగంలో ఉత్పాదకత, ఉద్యోగ కల్పన- నైపుణ్యాభివృద్ధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక రంగం, పరిశోధన- ఆవిష్కరణలు, తయారీ- సేవలు, తర్వాతతరం సంస్కరణలు- ఈ తొమ్మిది అంశాలను ప్రాధాన్యంగా తీసుకున్నట్లు తెలిపారు. వచ్చే రెండేళ్లలో కోటి మంది రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు.

--------------------------

దేశ ఆర్థికాభివృద్ధికి కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ దోహదం చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై ప్రధానమంత్రి మాట్లాడుతూ.. బడ్జెట్‌లో నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చామన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు మౌలిక, తయారీ రంగాలను

బలోపేతం చేసేవిధంగా బడ్జెట్‌లో స్థానం కల్పించామని పేర్కొంటూ...

..వాయిస్..33 సెకన్లు

---------------------------

కొత్త పన్ను విధానంలో కొన్ని మార్పులు చేసినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. బడ్జెట్ ప్రసంగంలో పన్ను శ్లాబుల గురించి మంత్రి తెలుపుతూ, పాత పన్ను విధానంలో మాత్రం ఎలాంటి మార్పులూ చేయలేదని తెలిపారు. 3 లక్షలలోపు ఎటువంటి పన్ను ఉండదని తెలిపారు. 3 నుంచి 7 లక్షల వరకు 5 శాతం పన్ను, 7 నుంచి 10 లక్షల వరకు 10 శాతం, 10 నుంచి 12 లక్షల వరకు 15 శాతం , 12 నుంచి 15 లక్షల వరకు 20 శాతం, 15 లక్షల పైన 30 శాతం పన్ను ఉంటుందని తెలిపారు. అలాగే ప్రస్తుత ప్రామాణిక తగ్గింపు- స్టాండర్డ్ డిడక్షన్ 50 వేల రూపాయలుగా ఉండగా.. ఆ మొత్తాన్ని 75 వేల రూపాయలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. తద్వారా 17 వేల 5 వందల రూపాయల వరకు పన్ను ఆదా చేసుకోవచ్చని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి 15 వేల కోట్ల రూపాయల ఆర్థిక సాయం ఇవ్వనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ఆర్థిక సాయంపై మంత్రి మాట్లాడుతూ, విభజన చట్టానికి అనుగుణంగా అవసరాన్ని బట్టి భవిష్యత్తులో మరిన్ని అదనపు నిధులు కేటాయిస్తామని చెప్పారు. పారిశ్రామికాభివృద్ధికి ప్రత్యేక సహకారం అందిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్, రైతులకు పోలవరం జీవనాడి అని, పోలవరం నిర్మాణం సత్వరం జరిగేలా సంపూర్ణ సాయం అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వనున్నట్లు మంత్రి పేర్కొంటూ....

వాయిస్.... 40 సెకన్లు

---------------------------

రాష్ట్ర శాసనసభ సమావేశాలు రెండవరోజు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రెండు బిల్లులను ప్రవేశపెట్టింది. భూహక్కు చట్టాన్ని రద్దు చేసే బిల్లును రెవెన్యూ, రిజిస్ట్రేషన్-స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రవేశపెట్టగా శాసన సభ ఆమోదం తెలిపింది. విజయవాడలోని ఆరోగ్య విశ్వవిద్యాలయానికి ఎన్టీఆర్ పేరు సవరణను రద్దు చేసే బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. అనంతరం గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని రాయదుర్గం శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు ప్రవేశపెట్టారు. దీనిపై పలువురు సభ్యులు ప్రసంగిస్తున్నారు.

---------------------------

రాష్ట్రంలో వచ్చే ఏడాది నుండి ప్రభుత్వం అత్యుత్తమ విద్యా విధానాన్ని ప్రవేశ పెడుతుందని మానవ వనరులు, ఐ.టి., ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. శాసన సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఈరోజు పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెబుతూ, విద్యా వ్యవస్థను పటిష్టం చేసే దిశగా ఈ రంగాన్ని ప్రక్షాళన చేస్తామని చెప్పారు. విద్యార్థులలో ప్రతిభా పాటవాలు వెలికి తీసేలా ఉత్తమ విద్యా విధానాన్ని తీసుకువస్తామని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల ప్రమాణాలను మెరుగు పరుస్తామని, అందువల్లనే ప్రభుత్వం మెగా డీఎస్సీని ప్రకటించిందని వివరించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమిస్తామని నారా లోకేష్ పేర్కొంటూ,

వాయిస్ (28 సెకన్లు )

---------------------------

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్‌ను పటిష్టం చేసి యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ తరహాలో ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. శాసన సభలో ఈరోజు తెలుగు దేశం సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కోలికపూడి శ్రీనివాస రావు, ధూళిపాళ్ళ నరేంద్ర తదితరులు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలపై అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెబుతూ, ఈ అంశం కోర్టు పరిధిలో వుందని, అవకతవకలపై విచారణ కోసం నియమించిన సంఘం నివేదిక ఆగష్టు నెలాఖరుకు అందుతుందని, ఆ తరువాత చేపట్టవలసిన చర్యలను ప్రభుత్వం ఆలోచిస్తుందని, నష్టపోయిన విద్యార్థులకు ఏ విధంగా న్యాయం చేయాలన్న అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తుందని పయ్యావుల కేశవ్ వివరించారు.

---------------------------

వరద ప్రభావిత ప్రాంతాల్లో కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన మందులు తగినంత నిల్వ ఉండేలా చూసుకోవడంతో పాటు మందుల గడువు తేదీలను పరిశీలించాలని సూచించింది. అత్యవసర పరిస్థితులకు అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని, వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు రక్షిత మంచినీటిని అందించాలని తెలిపింది. ఆరోగ్య శిబిరాల్లో వైద్యాధికారులు, నర్సులు, ఆశాకార్యకర్తలతో కూడిన వైద్య బృందాలు, ప్రథమ చికిత్స కిట్లు, అత్యవసర మందులను అందుబాటులో ఉంచినట్లు చెప్పింది.

---------------------------

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయంచడంపై పలువురు హర్షం చేశారు. బడ్జెట్లో 15 వేల కోట్లు కేటాయించి ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి కట్టుబడిన ఎన్డీయే ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.పోలవరం ప్రాజెక్టుకు సంపూర్ణ సహకారంతో పాటు వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ఆర్థికసాయం ప్రకటించిన కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలియజేశారు. మరోవైపు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను స్వాగతిస్తున్నట్లు తిరుపతి జిల్లా వాసులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం కేంద్రం నిధులు కేటాయించడం హర్షణీయమని ఆకాశవాణికి తెలుపుతూ...

వాయిస్ ... 26 సెకన్లు

---------------------------

రాజధాని అమరావతి పరిధిలోని గ్రామాల్లో జాతీయ పట్టణ వ్యవహారాల సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక ప్రాజెక్టు పనులను వచ్చే నెలాఖరులోగా పూర్తి చేయాలని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ ఆదేశించారు. రాజధాని ప్రాంతంలో మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లోని గ్రామాల్లో చేపట్టిన పనులపై అధికారులు, సంబంధిత గుత్తేదారులతో సమావేశమై పరిస్థితిని మంత్రి సమీక్షించారు. రాజధాని ప్రాంతంలో 14 ప్రభుత్వ పాఠశాలలు, 17 అధునాతన అంగన్‌వాడీ కేంద్రాలు, 16 ఈ-వైద్యం కేంద్రాలు వంటి నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నట్లు అధికారులు మంత్రికి వివరించారు.

=====================